

స్పందించండి మహాప్రభో..

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని టిఆర్ పురం సమీపంలో విద్యుత్ లైన్ వైర్లు కిందకి వేలాడుతున్నాయని, వాటిని వలన మనుషులకు, మూగ జీవాలకు ఏదైనా ప్రమాదం జరుగక ముందే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గత మూడు రోజులుగా లైన్లు తెగిపోయి కిందకు వేలాడుతున్నా ఇంతవరకు స్థానిక లైన్మెన్లు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కింద వేలాడుతున్న విద్యుత్ లైన్‌లను తక్షణమే తొలగించాలని కోరారు.



జీవో 117ను రద్దు చేయాల్సిందే

- పాఠశాలల పునః వ్యవస్థీకరణపై సమీక్షించాలి
- ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

ప్రభుత్వ పాఠశాలల పునః వ్యవస్థీకరణ కోసం విడుదల చేసిన జీవో 117 పై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘం నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవో అమలు కోసం విడుదల చేసిన మార్గదర్శకాలపై పునః సమీక్షించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నాయి. తమకున్న అనేక అనుమానాలను నివత్తి చేయకుండానే ప్రభుత్వం పాఠశాలల హేతుబద్ధీకరణ దిశగా ముందుకెలితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే ఉద్యమం తప్పదు అంటూ కార్యాచరణకు సిద్ధమవుతుండడం గమనార్హం.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల స్వరూపం మారనుంది. ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, హైస్కూల్ ప్లస్ పేర్లతో బడులను పునర్వ్యవస్థీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమయింది. రాష్ట్రంలో 20 వేల బేసిక్ ప్రైమరీ పాఠశాలల (బిపిఎస్)ను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ (ఎంపిఎస్) విధానాన్ని విద్యాశాఖ తీసుకొస్తుంది. ప్రభుత్వ విద్యారంగాన్ని బలంగా తయారు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణిస్తోంది. ఉపాధ్యాయుల సంఖ్య ను తగ్గించి పనిభారం పెంచుతోంది. హైస్కూల్సులో 54మంది విద్యార్థులు ఉంటేనే 2వ పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్ పోస్టులు సర్ ప్లస్ అవుతున్నాయి. మోడల్ ప్రైమరీ స్కూల్సుకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్ స్కూల్సు, బేసిక్ ప్రైమరీ స్కూల్సును నిర్వీర్యం చేస్తుండడంతో ఇప్పటికే దశలవారీగా పోరాటం చేసిన ఉపాధ్యాయ సంఘాల నేతలు మే 15వ తేదీన వేలాదిమంది ఉపాధ్యాయులతో విద్యాభవన్‌ను ముట్టడించనుండడం గమనార్హం.

లోపాలను సరిదిద్దాలి

ఎస్ఎస్ నాయుడు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



నూతన ప్రభుత్వం 117 జీవోను రద్దు చేస్తూ పాఠశాలలను పునర్వ్యవస్థీకరించిన విధానాన్ని సరిదిద్దాల్సిందే. ప్రాథమిక పాఠశాలను బేసిక్ పాఠశాలలుగా కొనసాగించాలని కోరగా ఫౌండేషన్ పాఠశాలలుగా, మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా విభజించడమే కాకుండా కొన్నిచోట్ల ఒకటి నుండి ఐదు తరగతులను హైస్కూలులో కలపడం, మూడు, నాలుగు, ఐదు తరగతులు సమీప పాఠశాలల్లో విలీనం చేయడం సరైన విధానం కాదు .పునర్వ్యవస్థీకరించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులను కేటాయించే సందర్భంలో కొన్ని పాఠశాలలకు పదిమంది విద్యార్థులకు ఉపాధ్యాయుడు కొన్నింటిలో 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు కొన్నింటిలో 30 మందికి విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించడాన్ని సవరించాలని కోరుతున్నాం. ప్రాథమిక పాఠశాలలో ఏ రూపంలో ఉన్న ఒకే రకమైన ఉపాధ్యాయ -విద్యార్థి రేషియోను కలిగి ఉండాలని కోరుతున్నాం. అలాగే బదిలీల సందర్భంగా అనేక మోడల్ ప్రైమరీ పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్లను కేటాయించవద్దని కోరుతున్నాం.

పేద విద్యార్థులకు విద్యను దూరం చేయడమే

భగత్‌రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



మోడల్ స్కూల్స్ పేరుతో పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకే ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. 177 జీఓ ద్వారా జిల్లా లో దాదాపు మోడల్ పేరుతో 700 దాక పేదలు చదివే పాఠశాలలు మూసివేయడం దుర్మార్గం. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల పై జిల్లా కలెక్టర్ నుంచి స్థానిక విద్యా శాఖ అధికారులందరు ఒత్తిడి తీసుకొచ్చి పాఠశాలల్ని మూసివేస్తుండటం శోచనీయం. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షకులుగా ఉండాల్సిన వారే ఒత్తిడితో వాటిని మూసి వేసేందుకు సహకరిస్తుండడం దుర్మార్గం.

టమాటా రైతులు కుదేలు

- గిట్టుబాటు ధర లేక రైతుల ఆందోళన
- ఆరుగాలం కష్టపడినా నష్టాలే..
- పంటను పొలాల్లోనే వదిలేస్తున్న వైనం..



కోయకుండా పొలంలోనే వదిలేసిన టమాటాలు

టమోటా రైతును కదిలిస్తే చాలు వారికి కన్నీళ్లు ఆగడం లేదు.. మూడు నెలలపాటు శ్రమిస్తే వారికి నష్టాలే మిగిలాయి. ఆరుగాలం కష్టపడిన టమాటా రైతులు మద్దతు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. చేతికొచ్చిన పంటను కోసి అమ్మేందుకు సాహసించని కొందరు తోటలోనే వదిలేస్తుంటే.. కూలీలను పెట్టించి కోయించినా గిట్టుబాటు ధర రావటం లేదని మరికొంత మంది రైతులు వాపోతున్నారు.

> గత ఏడాది కన్నా ఈ ఏడాది టమోటా పంటను రైతులు అధికంగా సాగు చేశారు. పుంగనూరు, పెద్దపంజాణి, చౌడేపల్లి, సోమల, సదుం మండలాల్లో గత ఏడాది 2వేల 60 హెక్టార్లు లో టమాటా పంటను సాగు చేయగా ఈ ఏడాది 5120 హెక్టార్లలో టమాటా పంటను సాగు చేశారు.

ప్రజాశక్తి- పుంగనూరు: టమాటా విక్రయాలలో పెద్ద మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె ఆ తర్వాత పుంగనూరు మార్కెట్. ఈ మార్కెట్‌లో రైతులకు ప్రస్తుతం ధరలు లేక అల్లాడుతున్నారు. ధరలు ఎప్పుడు పెరుగుతాయా అని రైతు ఆశగా అని ఎదురు చూస్తున్నారు. పుంగనూరు, పెద్దపంజాణి, చౌడేపల్లి, సోమల, సదుం మండలాల పరిధిలో 5120 హెక్టార్లలో టమోటా పంటను సాగు చేసి ఉన్నారు. గత ఏడాది 2060 హెక్టార్లలో టమాటా సాగు చేయగా ఈ ఏడాది మాత్రం మూడు వేల హెక్టార్లలో రైతులు అధికంగా టమాటా పంట సాగు చేశారు. ఇక పుంగనూరు మార్కెట్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని మధురై, తిరుచి, పేని, చెన్నై, ఈ రోడ్, తిరునామలైతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైజాగ్, అనకాపల్లి, శ్రీకాకుళం, కాకినాడతో పాటు ఒరిస్సా, కలకత్తా ప్రాంతాలకు టమాటా ఎగుమతి అవుతోంది. నిత్యం 1000 టన్నుల వరకు టమాటా ఎగుమతి చేస్తారు. గతంలో టమాటా కిలో రూ.80ల వరకు ధర పలికింది. బయట ప్రాంతాలలో కూడా టమాటా సాగు ఎక్కువగా ఉండడంతో మార్కెట్‌లో ధరలు పడిపోతున్నాయి. రెండు వారాలుగా నాణ్యమైన టమాట కిలో రూ.4 నుంచి 5లు పలుకుతుండగా నాణ్యత లేని రెండో రకం టమాటా కిలో రూ.2.75లు జూసులకు వెళ్లే టమాటాలకు అయితే రూ.2లు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో కోసిన పంటకే ధర లేదు ఇక ఉన్న పంటని ఏమీ చేసుకోవాలో తెలియక అయోమయంలో పడుతున్నారు రైతులు.. పక్కన ఉండే తమిళనాడులో సైతం టమాటా సాగు ఎక్కువ కావడంతో అటునుండి ఎవరు టమాటాల కోసం ఏపీకి తక్కువగా వస్తున్నారు. అయితే మార్కెట్‌కు టమోటా విక్రయానికి తీసుకొచ్చిన రైతులకు కనీసం ట్రాన్స్ పోర్ట్, కూలీ ఖర్చులకు కాదు కదా.. తిరుగు ప్రయాణం చార్జీలకు కూడా రావడం లేదని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

గత ఏడాది పుంగనూరు మార్కెట్లో కిలో రూ.40 నుండి 55 రూపాయలు ధర పలికింది. ఈ ఏడాది కూడా అలానే ఉంటుందని నాలుగు రూపాయలు సంపాదించుకుందామని ఆశ పడ్డా టమాటా రైతుల ఆశలు మార్కెట్ ధరలు పతనం కావడంతో ఆవిరయ్యాయి. ఇక ఆరుగాలం శ్రమించి, పండించిన పంటను మార్కెట్‌కు తీసుకు వస్తున్న రైతుకు ఇక్కడ తీవ్ర నిరాశ ఎదురవుతోంది. టమాటా కొనుగోలుకు బయటి వ్యాపారులు కొనుగోలు చేసిన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో కష్టపడి పండించిన రైతులకు కన్నీళ్లే మిగులుతుంది. ఎంతో వ్యయప్రయాసలు పడి మార్కెట్టుకు తీసుకొస్తున్న టమాటాను.. చివరకు ఏమి చేయాలో తెలియక ఉసూరుమని రైతులు వెనుతిరుగుతున్నారు. కూలీ, రవాణా ఖర్చులూ దండగేనంటూ.. చాలా మంది రైతులు పొలాల్లోనే పంటను వదిలేయాల్సిన నిస్సహాయత నెలకొంది. కొందరు రోడ్డుపై పారబోస్తుండగా, మరి కొందరు పశువులకు మేతగా వదిలేస్తున్న దుస్థితి. ఈ సంవత్సరం పంట బాగా రావడంతో రికార్డు స్థాయిలో పంటను రైతులు పుంగనూరు మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. పోటీ కారణంగా ధరలు పడిపోతున్నాయాని సమాచారం, ధరలు లేక కుంగిపోయామని తమకు గిట్టుబాటు ధరలను ప్రభుత్వం కల్పించాలని రైతులు కోరుతున్నారు..

ఉద్యోగస్తులు సాఫ్ట్వేర్లు టమాటా పంటపై మొగ్గు

గత ఏడాది టమాటా పంట సాగు చేసిన ప్రతి ఒక్కరూ లక్షలు, కోట్లల్లోనే ఆదాయాలు రావడంతో ఈ ఏడాది సాఫ్ట్వేర్ ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగస్తులు, టమాటా పంట సాగు చేసేందుకు మొగ్గు చూపారు. వీరంతా లీజుకు భూమి తీసుకొని టమాటా పంటను సాగుచేశారు. తీరా ఈ ఏడాది టమాటాకు గిట్టుబాటు ధర లేకపోవడంతో వీరి ఆశలు అడియాశలు అయ్యాయి. సామాన్య రైతులు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.



మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉంచిన టమాటా బాక్సులు

తినేముందు ఆలోచించండి..

- పండ్లు కూరగాయల్లో క్లోరిపైరిఫాస్ అవశేషాలు
- విచ్చలవిడిగా వినియోగం
- పట్టించుకోని అధికారులు
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు

పండే విషంగా మారితే.. కూరగాయలే నిలువెల్లా గాయాలు చేస్తుంటే ఎవరికి చెప్పుకోవాలి. నేటి మానవుని ఆరోగ్య పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కడుపుకు పోయే ప్రతి పదార్థంలోనూ రసాయన అవశేషాలే కనిపిస్తున్నాయి. వైద్యులు మాంసాహారాలు మాని కూరగాయలు, పండ్లు తినమంటున్నారు. కానీ నేడు మాంసం కన్నా ఇవే అత్యంత ప్రమాదకరంగా మారుతున్నాయి. మానవుని ఆరోగ్యానికి ముప్పుగా మారాయి.



ప్రజాశక్తి- పూతలపట్టు: అచ్చం ఇదే జరుగుతోంది.. పండ్లు, కూరగాయల సాగులో విచ్చలవిడిగా క్లోరిపైరిఫాస్ రసాయన వాడకం వల్ల దాని అవశేషాలు వాటిల్లో అలాగే ఉండిపోయి వాటిని తిన్నవారిలో అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు దీర్ఘకాలిక ప్రమాదకర వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ ఉత్పత్తులను నేరుగా తినడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. పండ్లు కూరగాయల పంటల్లో పురుగుల నివారణకు రైతులు ఆ రసాయనం వాడుతున్నారు. చిత్తూరు జిల్లాలో వరి, కూరగాయలు ఆకుకూరలు కొన్ని రకాల పండ్ల జాతుల పంటలు క్లోరిపైరిఫాస్ వినియోగం ఎక్కువగా ఉంది. ఇతర రకాల మందులతో కలిపి కాంబినేషన్ కూడా దీనిని చల్లుతున్నారు. ఇతర దేశాలకు ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తుల్లోనూ దీని అవశేషాలు బయటపడడం గమనార్హం. క్లోరిపైరిఫాస్ మందు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

పురుగులను నివారించేందుకు..

లద్దె పురుగు, శనగపచ్చ పురుగు, గులాబీ రంగు పురుగు, పచ్చ పురుగు, ఆకు చుట్టు పురుగు, మొవ్వ పురుగు తదితరాలు పంటలను నాశనం చేస్తున్నాయి. వీటి నివారణకు నాలుగు దశాబ్దాలుగా ఎకరాకు అర లీటర్ సిఫార్సు ఉన్నప్పటికీ అధికంగా వాడటంతో దాని అవశేషాల వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వాస్తవానికి క్లోరిపైరిఫాస్ మందు పిచికారి చేసిన వారం రోజుల తర్వాతే పండ్లు కూరగాయలు కోయాలి. చాలా మంది రైతులు మందుచెల్లిన రెండు లేదా మూడు రోజులకు కోసేస్తున్నారు. కొందరు రైతులు మోతాదుకు మించి కూడా చల్లుతున్నారు. ఎర్ర నేలల్లో ఉన్నచోట చెదలు నివారణకు కూడా దీన్ని వాడుతున్నారు. ఇల్లు భవనాల నిర్మాణ సమయంలో పునాదుల దశలో క్లోరిపైరిఫాస్ వేస్తున్నారు.

ప్రత్యామ్నాయాలు వాడితే...

- మధురవాణి, వ్యవసాయ అధికారిని మధురవాణి.

పంటల్లో పురుగుల నివారణకు ఇటీవల నూతన క్రిమిసంహారాలు మార్కెట్లోకి వస్తున్నాయి. పురుగులను వేగంగా చంపడానికి అధిక గాఢత కలిగిన కొత్త రకాల మందులను రైతులు చల్లుతున్నారు. క్లోరిపైరిఫాస్ ఇతర మందులను సైతం చల్లుతున్నారు. పూతకు వచ్చిన సమయం నుంచి కాయ ఏర్పడే దశ వరకు ఈ మందు చల్లితే అవశేషాలు కాయల లోపల ఉండిపోతున్నాయి. కూరగాయలు పండ్లను బాగా కడిగి వినియోగించాలి.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవు

డేకాయిట్ ఆపరేషన్‌లో తమిళనాడు క్రిష్ణగిరి ముఠా అరెస్టు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: డేకాయిట్ ఆపరేషన్‌లో భాగంగా నగరంలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే తమిళనాడు క్రిష్ణగిరికి చెందిన ముఠాను అరెస్టు చేసి వన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని అటువంటి పరీక్షలు చేసే వారిపై కఠిన చర్యలు చట్టపరంగా తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరు నగరంలోని 9వ వార్డు భరత్‌నగర్ కాలనీలోని ఒక ఇంట్లో లింగ నిర్ధారణ పరీక్ష నిర్వహించడానికి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి నుంచి వచ్చిన వారిని డెకాయిట్ ఆపరేషన్ల భాగంగా గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లి గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకునేందుకు వచ్చిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ ఆపరేషన్‌లో గర్భస్థ లింగ నిర్ధారణ చేసే సంబంధిత పరికరాలను, ఇంటిని సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి డిఎంఅండ్ హెచ్ఓ, డిసి హెచ్ఎస్‌లకు నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ సమయంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు 11మంది మహిళలు సిద్ధంగా ఉన్నారని, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షల నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిసినా కూడా ఇలా చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, తహశీల్దారు చంద్రశేఖర్, వన్ టౌన్ పోలీసులు పాల్గొన్నారు.



లింగ నిర్ధారణ పరీక్షల ముఠాను చూపుతున్న జిల్లా కలెక్టర్

పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి: ఎస్పీ



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో భాగంగా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టాలని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. బుధవారం కుప్పం పర్యటనలో భాగంగా ఆయన శాంతిపురం మండల పరిధిలోని ముఖ్యమంత్రి నూతనంగా నిర్మిస్తున్న స్వగృహ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గంలో నిర్మించుకున్న నూతన గృహప్రవేశంలో భాగంగా ఈనెల 25వ తేదీ కుప్పం రానున్నట్టు తెలిపారు. ఆయన రాక సందర్భంగా ప్రజా సమూహం ఎక్కువగా కేంద్రీకృతం అయ్యే ప్రాంతాలు, రూట్ మ్యాప్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పార్కింగ్ ఏర్పాట్లు, ఫైర్ సేఫ్టీ, ఎంబులెన్స్‌లు తదితర సౌకర్యాలను ఎస్పీ సమీక్షించారు. ఈ పర్యటనకు భద్రత కల్పించాల్సిన అధికారులు, పోలీసు బలగాలకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. స్థానిక పోలీస్ అధికారులు, ఇంటెలిజెన్స్ విభాగం, స్పెషల్ బ్రాంచ్ బలగాలతో కలిసి సమన్వయంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కుప్పం డీఎస్పీ పార్థసారధి, కుప్పం అర్బన్ ఇన్స్పెక్టర్ శంకరయ్య, రూరల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గృహ నిర్మాణాలకు సంబంధించి జిల్లాలో యాక్టివ్ బెనిఫిషియారీలను గుర్తించి వారిచే గృహ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో గృహ నిర్మాణ పురోగతిపై హౌసింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాల పట్ల సరియైన యాక్టివ్ బెనిఫిషిరీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించాలని, లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణాల మంజూరుపై అవగాహన కల్పించి త్వరితగతిన గృహనిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమన్వయం చేసుకుని గృహనిర్మాణాల పురోగతిని సమీక్షించుకోవాలని ఆదేశించారు. జిల్లాకు మొత్తం 77,366 గృహాలు మంజూరు కాగా ఇందులో 50,539 గృహాలు పూర్తి కాగా 8,562 గృహాలు పునాది స్థాయిలో, 4,504 గృహాలు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయన్నారు. నిర్మాణాలు పూర్తి అయిన గృహాలకు సంబంధించి ఎఫ్‌టిఓలు జనరేట్ చేయాలని సూచించారు. ఎఫ్‌టిఓ జనరేట్ చేసిన బిల్లుల చెల్లింపు త్వరితగతిన జరుగుతున్నవని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన

విద్యార్థులను అభినందించిన కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఒకే పాఠశాలకు చెందిన ఐదుగురు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్‌లో నమోదు కావడం గర్వకారణమని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో బంగారుపాళ్యం మండలం, మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, గణిత ఉపాధ్యాయుడు హెచ్. అరుణ శివప్రసాద్‌కు లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడంతో వీరిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, సంపంగి, భారతి, సంజీవి, పిల్లారప్ప, పాపుదేసి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- ఐరాల: మండలంలోని మొరుంపల్లి గ్రామం వద్ద నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డుకు పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ భూమి పూజ చేశారు. బుధవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్‌కి మండల టిడిపి అధ్యక్షులు గిరిధర్ బాబు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం వీరి చేతుల మీదుగా మొరంపల్లె గ్రామం నుండి ఐరాల చిన్నగొల్లపల్లె గ్రామానికి రూ.35లక్షల వ్యయంతో నూతనం నిర్మించనున్న బీటీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే స్థానిక గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. గ్రామాల్లోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకుని రావాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మంచి రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వైద్యం, విద్యా రంగాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి అనేది కేవలం మాటలకు కాకుండా చేతల్లో చూపించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు హరిబాబు నాయుడు, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు

రేపు పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, డిఆర్‌డిఎ సంయుక్తంగా నగరి నియోజకవర్గంలోని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16వ తేదీన శుక్రవారం నిర్వహించనున్న జాబ్ మేళా గోడ పత్రికలను నగరి నియోజకవర్గ శాసన సభ్యులు గాలి భాను ప్రకాష్ ఆవిష్కరించారు. నగరి నియోజకవర్గ యువతి యువకులను ఈ జాబ్ మేళాలో పాల్గొనలసిందిగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఏం.గుణశేఖర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ జిల్లా ప్లేస్మెంట్ అధికారి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన బృందావన్ విద్యార్థులు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సీబీఎస్ఈ ఫలితాల్లో బృందావన్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి స్కూల్ ఖ్యాతిని పెంచారని స్కూల్ కరస్పాండెంట్ శైలజ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎస్.రూబిని 473, సికె.సంతోష్ 467, ఆర్.జ్యోత్స్న, బి.జయ ప్రసున్న 439, డి.డీరజ్ విఘ్నేష్ చౌదరి 415, పి.జ్యోత్స్న, మోనిష్ బాబు 411 మార్కులు సాధించారని, అలాగే పది ఫలితాల్లో ఏ.చరణ్ కుమార్ 472, రెడ్డి కృష్ణప్రసాద్ 429, టి. ప్రణవ్ సాయి 411 మార్కులు సాధించారని తెలిపారు.

మెరిసిన పీఈఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పీఈఎస్ పబ్లిక్ పాఠశాల 10,12 తరగతుల విద్యార్థులు 2024-25 సీబీఎస్ఈ పరీక్షలలో 100శాతం ఫలితాలు సాధించి మరోసారి వారి సత్తాను చాటుకున్నారు. 10వ తరగతికి చెందిన ఆర్. సుప్రిత 93 శాతం, శ్రేష్టాశెట్టి 92శాతం ఫలితాలు సాధించారు. 12వ తరగతిలో ఎంపీసీ విభాగంలో టి.అరవింద్ 91 శాతం, జే. వినయ్ 86 శాతం ఫలితాలు సాధించారు. గత 8 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం సీబీఎస్ఈ ఫలితాలలో 100 శాతం ఫలితాలు సాధిస్తూ, ఈ సంవత్సరం ఫలితాలలో కూడా అశేషమైన ప్రతిభను చాటుకున్నారని, నిరంతర శ్రమ, లక్ష్యసాధన ఉంటే మెరుగైన ఫలితాలు సాధిస్తారని, ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు వారి విజయానికి కారకులైన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు యాజమాన్యం తరపున పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణబాబు అభినందనలు తెలియజేశారు.



సీబీఎస్ఈ పరీక్షా ఫలితాలో

సత్తా చాటిన అమరరాజా విద్యార్థులు

ప్రజాశక్తి- తవణంపల్లి: సీబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో తవణంపల్లి మండలంలోని దిగువ మాఘం గ్రామంలో ఉన్న అమర రాజా విద్యాలయం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ ఎన్. జయశ్రీ తెలిపారు. ఫలితాల్లో పదవ తరగతి ఫలితాల్లో పి. లేఖన 474 మార్కులతో ప్రథమ స్థానాన్ని సాధించగా, ఎం.బేబీ జిత్య(469), టి. తనీష్(461), వై. జాహ్నవి(459), కె. యోగికృష్ణ (453) అద్భుత ఫలితాలు సాధించారని తెలిపారు. 12వ తరగతి ఫలితాల్లో కెల్విన్ ఓం 443 మార్కులతో మొదటి స్థానం పొందగా, జి.కావ్య (412), వి. అఖిల్ (409), ఎన్. నందిని (402), ఎస్ఎం. హుస్సేన్ (411) ఉత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఈ అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపల్‌తోపాటు రాజన్న ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ ఆర్.సతీష్, అమర రాజా సంస్థల ఫౌండర్ ఛైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు అభినందించారు.

అందుబాటులో ప్రభుత్వపాఠ్యపుస్తకాలు

ఎంఈఓ 2 రమేష్ బాబు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఎంఈఓ 2 రమేష్ బాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, నోటి పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందించిందని వీటిని పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం లోపలే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని, స్కూల్ ప్రారంభించే రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయులు జగదీష్, సిఆర్పి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన పైపు లైన్లు ఏర్పాటు



ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే గ్రౌండ్ ట్యాంక్ వద్ద పైప్ లైన్ లీకేజీని మండల ప్రత్యేక అధికారిని గౌరీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి వెంటనే లీకేజీ అరికట్టాలని నూతన పైప్లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి జయశంకర్ బుధవారం లీకేజీ అవుతున్న ప్రాంతాన్ని పరిశీలించి పాత పైప్‌లైన్‌ను తొలగించి నూతన పైపు ఏర్పాటు చేశారు. నీటి వృథాను అరికట్టేందుకు కొత్త ఐరన్‌పైప్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు మృతికి నివాళి

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల టిడిపి నాయకులు చెంగల్రాయల్ యాదవ్, రాజా యోనా, జనార్దన్ రాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు గిరిబాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంగళవారం రాత్రి కోల్లగుంట చెక్పోస్ట్ వద్ద లారీ ప్రమాదంలో కోటర్వేడు గ్రామానికి చెందిన గిరిబాబు మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ రాజా వర్గం రూ.20వేలు దహనక్రియలకు ఆర్థిక సాయంగా అందించారు. టిడిపి నాయకులు రాజేంద్రరెడ్డి, సోమశేఖర్ యాదవ్, యువ నాయకుడు రాజా నివాళి అర్పించారు.

పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గంగజాతర

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మున్సిపల్ పరిధిలోని కీళపట్టు, నెత్తం కండ్రిగ ప్రాంతాల్లోను, రూరల్ మండలంలోని ముడిపల్లి, వీకేఆర్‌పురం, గుడికండ్రిగ, మిట్టపాళెం, మూలనత్తం, ఎం.కొత్తూరు గ్రామాల్లోను బుధవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. తిరుపతి జాతరతో పాటు ఈ ప్రాంతాల్లో జాతరను జరుపుకుంటారు. గ్రామాల్లో గంగమ్మ ఊరేగింపును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వీధినాటకాలు, నృత్యాలు స్థానికులను అలరించాయి. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మ్రొక్కులు తీర్చుకున్నారు. వేపాకు సారెలు, వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. వేపాకు సారెలు సమర్పించడానికి సుమారు 700మంది క్యూలైన్‌లో నిలబడటం ప్రత్యేకతను సంతరించుకుంది.

అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

నగరి ఐసీడీఎస్ పరిధిలోని నగరి మున్సిపాలిటీ, రూరల్ మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలి పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కె.కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరి మున్సిపాలిటీ చింతలపట్టెడ 3 (బీసి బి)అంగన్ వాడీ వర్కర్ పోస్టు, వినాయకపురం (బీసీ బి) హెల్పర్ పోస్టు, మండలంలోని వీకేఆర్‌పురం ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ హెల్పర్ (ఎస్టీ) పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఈ పోస్టుకు ధరఖాస్తు చేసుకొను అభ్యర్థులు 10వ తరగతి పాసై స్థానిక వివాహిత మహిళ (ఆ ఊరి కోడలు) అయివుండాలన్నారు. వయస్సు జూలై 1వ తేదీకి 21 నుంచి 35 వయస్సు లోపల ఉండాలన్నారు. అభ్యర్థులు ధరఖాస్తుతో పాటు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్, రేషన్ కార్డు, కుల, నివాస ధృవీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేసి జతపరచాలన్నారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ధరఖాస్తులు సమర్పించాలన్నారు.

కంటి చికిత్సకు 30 మంది ఎంపిక



ప్రజాశక్తి- బంగారుపాల్యం: ఉచిత కంటి చికిత్సకు 30మంది ఎంపికైనట్టు జీసస్ బ్లెస్సింగ్ చర్చి ఫాదర్ కిరణ్ తెలిపారు. బుధవారం మండలంలోని రాగిమానుపెంట ప్రాథమిక పాఠశాలలో కంటి వైద్యశిబిరం జీసస్ బ్లెస్సింగ్ వెన్ వేర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 90 మంది కంటి పరీక్షలు చేసుకోగా 30 మందికి కంటి సమస్యలు ఉన్నట్టు వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. వీరికి మిషన్ ఫర్ విజన్ శంకర్ నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ నేత్ర సిబ్బంది మురళి, తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కు ఘన సన్మానం



ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పట్టణ టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు సతీష్‌ను స్థానిక టిడిపి నాయకులు, గాండ్ల కులస్తులు కెసి ఆసుపత్రి ఆవరణలో మాజీ ఎంపీపీ చౌడప్ప ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ అభివృద్ధి కమిటీ సభ్యునిగా గాండ్ల కులస్థుడైన సతీష్ కుమార్ ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. కుప్పం అభివృద్ధి అథారిటీ సలహా మండలి సభ్యునిగా సతీష్ ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

చాటుతో ప్రారంభమైన గంగ జాతర

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీలో ఈనెల 20, 21 తేదీలలో గంగ జాతర నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిశ్చయించడంతో మంగళవారం రాత్రి గ్రామంలో గంగ చాటింపును వేశారు. గ్రామచావిడి వద్ద మంగళవారం రాత్రి ప్రజలు అందరూ చేరి పూజలు నిర్వహించి 11 గంటల ప్రాంతంలో గంగ జాతర చాటింపును వేశారు. ఈనెల 20వ తేదీ మంగళవారం రాత్రి అమ్మవారి విగ్రహం ప్రతిష్ట, 21వ తేదీ నడివీధి పొంగళ్ళు సాయంత్రం అమ్మవారి మట్టి విగ్రహం నిమజ్జనం ఉంటాయని తెలిపారు.

రైతుల పేర్లు వెరిఫై చేసుకోవాలి

ప్రజాశక్తి- గుడిపల్లి: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి భూమి ఉన్న రైతుల వివరాలు వెరిఫికేషన్ చేయడం జరుగుతోందని, రైతులందరూ స్థానిక రైతు సేవా కేంద్రాలలో వాళ్ళ ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్, రేషన్ కార్డు, మొబైల్ తీసుకెళ్లి వెరిఫై చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. అదేవిధంగా టాక్స్ పే చేసిన, ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఉన్న, పెన్షన్ పొందుతున్న, రాజ్యాంగబద్ధ పదవులలో ఉన్న, డెత్ అయి ఉన్న, వారిని అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన విధివిధానాల ప్రకారం వెరిఫికేషన్ చేసి అర్హత ఉన్న లబ్ధిదారులను ఫేసియల్ ద్వారా ఈ కేవైసీ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

భూ సర్వేలకు సహకరించండి

తహశీల్దార్

ప్రజాశక్తి- గంగవరం: ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో భూ సర్వేలు నిర్వహిస్తున్నామని అందుకు రైతులు సహకరించాలని గంగవరం తహశీల్దార్ మాధవరాజు బుధవారం ఓ ప్రకటలో కోరారు. ప్రస్తుతం మండలంలోని మేలు కళ్ళుపల్లి పంచాయతీలలో సర్వేలు జరుగుతున్నాయని రెవెన్యూ సిబ్బంది ఉదయం వస్తారని ఈ పంచాయతీలలో అందుబాటులో ఉంటారని రైతులు తమ భూ సమాచారాన్ని దగ్గర ఉంచుకొని అధికారులకు సహకరించాలని దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని కోరారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ప్రజాశక్తి - రామకుప్పం : స్వయం సహకార సంఘం మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ధ్యేయంతో కూటమి ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చిందని రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల డ్వాక్రా మహిళలతో కుట్టు మిషన్ల శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు ఉచిత కుట్టు మిషన్ ద్వారా ప్రతి ఒక్కరు శిక్షణ పొందాలని తద్వారా కుటుంబానికి ఆర్థిక, అభివృద్ధి తోడ్పడుతుందన్నారు. నరసింహులు, రామ్మూర్తి, చలపతి, చిన్నకృష్ణ, వెంకట్రామ గౌడు, మహమ్మద్ రఫీ, వెంకటరమణ, మనోహర్, వెంకటాచలం, రామలింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ అల్లెమ్మ, మహిళా అధ్యక్షురాలు పద్మమ్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రతి ఫైలూ వెరిఫికేషన్ చేయాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి బుధవారం రీసర్వే, రెగ్యులరైజేషన్ జీవో, అన్ని ఆన్‌లైన్ దరఖాస్తులు, రీ వెరిఫికేషన్, హౌస్ సైట్స్ పట్టా లబ్ధిదారులు, నీటి పన్నులు వంటి అన్ని అంశాలపై జిల్లాల కలెక్టర్లతో అదనపు సిసిఎల్ఏ నక్కల ప్రభాకర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీక్షలో చిత్తూరు జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ల్యాండ్, రికార్డ్స్ సర్వే ఏడీ జయరాజ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. హౌస్ సైట్స్‌కు అర్హులైన ప్రతి లబ్ధిదారుని గుర్తించాలని, జిల్లాల పరిధిలో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించాలని, జిల్లా పరిధిలో జరిగిన కార్యక్రమాల వివరాలను సీసీఎల్ఏకు పంపించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేకి సంబంధించిన ప్రతి ఫైల్‌ను జాయింట్ కలెక్టర్ వెరిఫికేషన్ చేయడం జరుగుతుందని, ప్రైవేట్ భూములు, కోర్టు కేసులకు సంబంధించిన భూములు వాటిని పరిశీలించి రీ సర్వే పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ మోహన్ కుమార్, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం కుప్పం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్రావిడ కూడలిలో వెలిసిన అమ్మవారి జాతరకు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జాతర సమయంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు వహించాలని పోలీసులను ఆదేశించారు. అమ్మవారి భక్తాదులు, స్థానిక ప్రజలు సైతం జాతర ప్రశాంత వాతావరణంలో జరగడానికి ఆలయ నిర్వాహకులకు, పురపాలక సంఘం, పోలీసు అధికారులకు సహకరించాలని సూచించారు. డీఎస్పీ పార్థసారథి, పోలీసులు, ఆలయ కమిటీ అధ్యక్షులు రవిచంద్రబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరులో గంగజాతర జరుగుతున్న సందర్భంగా చిత్తూరు ఎస్పీ వివిఎన్.మణికంఠ చందోలు గంగమ్మ గుడిని బుధవారం సందర్శించి జాతర కోసం జరుగుతున్న భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే బారికేడ్లు, సిసి టివి నిఘా, ప్రత్యేక నేర బృందాలు అందుబాటులో ఉన్నాయని ఎస్పీ ఆరా తీశారు. ఆయన వెంట సిఐ నరసింహారాజు, సిబ్బంది ఫెస్టివల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతరలో నగరపాలక సంస్థ విస్తృత సేవలు

పనులను పర్యవేక్షించిన కమిషనర్ పి.నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో జాతర సందర్భంగా నగరపాలక అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు విస్తృతంగా సేవలందించారు. జాతరకు ముందు రోజు నుంచే షిఫ్టుల వారీగా విధులు కేటాయించి పారిశుధ్యం, నీటి సరఫరా పనులు నిరంతరయంగా చేపట్టారు. నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆరోగ్య అధికారి డాక్టర్ పి.లోకేష్ పర్యవేక్షణలో ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది, కార్మికులు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కార్మికులు విధులు నిర్వహించారు. బజారు వీధిలోని నడివీధి గంగమ్మ, కొంగారెడ్డిపల్లి, గిరింపేట, సంతపేట, దొడ్డిపల్లి, మురకంబట్టు, ఓబనపల్లి, గంగా కాలనీ, మంగసముద్రం హౌసింగ్ కాలనీల్లో ఏర్పాటు చేసిన గంగమ్మ జాతరల వద్ద పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా నడివీధి గంగమ్మ, కొంగారెడ్డిపల్లి, గిరింపేట, సంతపేట, దొడ్డిపల్లి, మురకంబట్టు జాతర్ల వద్ద నిరంతరం శుభ్రతా పనులు చేపట్టారు. భక్తుల సమర్పించిన అంబళ్లను ఎప్పటికప్పుడు తరలించారు. భక్తులు తిరగాడే ప్రాంతంలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు. భక్తులకు నీటి సరఫరాను అందుబాటులో ఉంచారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించారు. జాతర జరిగే ప్రాంతాల్లో వైద్యశిబిరాలను నిర్వహించి, భక్తులకు వైద్యసేవలు అందించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ద్రావణాలను పంపిణీ చేశారు. నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ బుధవారం ఉదయం నడివీధి గంగమ్మ, కొంగారెడ్డిపల్లి, సంతపేట ప్రాంతాల్లో పర్యటించి పనులను పర్యవేక్షించారు.



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

సచివాలయాల్లో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు

మండలంలోని ముక్కళతూరు, గంగాధర నెల్లూరు గ్రామ సచివాలయాలను ఎంపీడీవో సతీష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో పలు రికార్డులను సక్రమంగా నిర్వహిస్తున్నారా.. లేదా పరిశీలించారు. సచివాలయంలో ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల నుండి వచ్చిన అర్జీల పరిష్కారం, సచివాలయ సిబ్బంది విధులకు హాజరవుతున్నారా, సమయపాలన పాటిస్తున్నారా వంటి విషయాలపై ఆరా తీశారు. అలాగే సచివాలయ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమాచారంతో కూడిన పోస్టర్లను ప్రదర్శించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు కిరణ్ కుమార్, చంద్ర, సర్వేయర్ వాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సతీష్

ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

మొక్కలు ఉచితంగా అందిస్తాం

జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి



ప్రజాశక్తి- విజయపురం (నగరి): ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో ఆయిల్‌ఫామ్ సాగులో మేలైన యాజమాన్య పద్దతులపై ఆయన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్‌ను నీరు ఇంకే ఏ నేలలోనైనా సాగుచేసుకోవచ్చన్నారు. మొక్కలను 9%-9-%9 అనే త్రిభుజాకార పద్ధతిలో నాటుకోవాలన్నారు. 14 నుంచి 18 నెలలకు పూతకు వస్తుందని రెండున్నరేళ్ల వరకు పూతను తీసివేయాలన్నారు. నాలుగవ సంవత్సరం నుండి దిగుబడి ప్రారంభమౌతుందని 30 యేళ్లవరకు దిగుబడి వస్తుందన్నారు. ఈ ఫామ్‌లో కోకో అనే పంటను అంతరపంటగా వేసుకోవచ్చన్నారు. గోద్రేజ్ ఆయిల్ ఫామ్ కంపెనీ నగరి, విజయపురం మండలాలకు మేలురకం ఆయిల్‌ఫామ్ మొక్కలను ఉచితంగా అందిస్తుందన్నారు. పంట సాగుకు గాను రూ.20 నుంచి 29 వేలు సబ్సిడీ అందిస్తామన్నారు. అంతర పంట నిర్వహణకు రూ.10500 సబ్సిడీ అందిస్తామన్నారు. గోద్రేజ్ డీజీఎం మురళి మాట్లాడుతూ రైతులకు నాణ్యతతో కూడిన మొక్కలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్‌ఫామ్ సాగుచేసి లాభాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, గంగాధర నెల్లూరు ఉద్యానవన అధికారి లోకేష్, రైతు సేవాకేంద్రం సిబ్బంది నాగరాజు, శోభ, ప్రేమ్, ఉదయ్, రేష్మ, లయశ్రీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కత్తెరపల్లి పీహెచ్సీని సందర్శించిన డీఐఓ

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి హనుమంతరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇమ్యూనైజేషన్‌కు సంబంధించి యువిఎన్.విన్ పోర్టల్‌ను ఓపెన్ చేసి పరిశీలించి తదుపరి ఏఎన్ఎమ్‌లకు తగు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా పిహెచ్సి పరిధిలో అన్ని రకాల రికార్డులను రిపోర్ట్స్‌ను తనిఖీ చేసి ముఖ్యమైన సూచనలు తెలియజేశారు. ఆరోగ్య కేంద్రం ప్రస్తుతం ఉన్న భవనంను తనిఖీ చేసి బిల్డింగ్ జరుగుతున్న నీటి లీకేజీ గురించి సిబ్బందిని విచారించడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని సచివాలయంలోకి ప్రతి బుధవారం, శనివారం యు.విన్ పోర్టల్‌లో డేటాను నమోదు చేయాలని ఆదేశించారు.



క్రైం న్యూస్

500 లీటర్ల సారా ఊట ధ్వంసం



నాటు సారా ఊటను ధ్వంసం చేస్తున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం అటవీశాఖ అధికారులు మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన సారా ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారి ఆదేశాల మేరకు, కుప్పం అటవీ క్షేత్రాధికారి సూచనలతో మండల పరిధిలోని గ్రామీణ అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో మండల పరిధిలోని మొట్లచేను అటవీ ప్రాంతంలో రెండు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన 500 లీటర్ల నాటు సారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక తరచూ నియోజకవర్గ పరిధిలోని అటవీ ప్రాంతాలలో అటవీ అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు.

కాలువలో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి


మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ శ్మశానం వద్ద గల డ్రైనేజ్ కాలువలో ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మండలంలోని దేవదొడ్డి పంచాయతీ పరిధిలోని కామినాయనపల్లి గ్రామంకు చెందిన శంకరప్ప (85)కు మూర్ఛ వ్యాధి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. సదరు వృద్ధుడు కాలువ పక్కన నడుస్తున్న సమయంలో మూర్ఛ రావడంతో పక్కలే ఉన్న డ్రైనేజీ కాలువలో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ అతన్ని గుర్తించకపోవడంతో కాలువలోనే మరణించాడు. శంకరప్ప మనవడు అటు వెలుత్తూ తాత మృతిచెంది ఉండటాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపడంతో స్థానికుల సాయంతో కాలువ నుంచి బయటకు తీశారు. అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కాలువలో పడి మృతి చెందిన శంకరప్ప

అగ్నికి ఆహుతైన కారు

ప్రజాశక్తి- తవణంపల్లి:




మండలం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఓ కారు అగ్నికి ఆహుతైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుపతికి చెందిన తేజ గంగ జాతర సందర్భంగా పుత్తూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా స్పీడ్ బ్రేకర్ ముందు వెళుతున్న చెన్నైకి చెందిన బొలెరో వాహనం ఉన్నట్లుండి బ్రేక్ వేయడంతో వెనుక వైపు ఉన్న కారు డీకొనడంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి, వెంటనే కారులోని వారు బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది. కాగా కారు పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి- సోమల: తాము చెల్లించిన డిపాజిట్ డబ్బులు వెనక్కు ఇవ్వమని అడిగి ఆ డబ్బులు కోసం దాడి చేసిన సంఘటనపై సదుం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయినట్లు ఎస్సై షేక్షావలి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాయలసీమ జోన్ కిసాన్ యోజన పథకం కింద టీ.వెంకటరమణా అనే వ్యక్తి డీలర్ షిప్ తీసుకున్నాడు. అతని వద్ద నుంచి సదుం మండలం బూరగ మంద పంచాయతీ దిన్నె వడ్డేపల్లికి చెందిన నాగవేణి సబ్ డీలర్‌గా డీలర్ షిప్ తీసుకున్నది. ఆమె సెక్యూరిటీ డిపార్ట్ కింద 5000 రూపాయలను చెల్లించింది. అదేవిధంగా 800 రూపాయల చొప్పున రైతుల వద్ద నుంచి డిపాజిట్లు సేకరించి చెల్లించింది. దాదాపు నాలుగు లక్షల వరకు ఆమె రైతుల వద్ద నుంచి వసూలు చేసి సెక్యూరిటీ డిపాజిట్ కింద వెంకట రమణకు చెల్లించింది. కానీ పనులు ప్రారంభం కాకపోవడంతో నాగవేణి తన డబ్బులు తనకు ఇప్పించాలని, రైతులు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగుతున్నారని వెంకట రమణను, ఆమె భర్త రూపేంద్ర, గుడ్లవారిపల్లి చెందిన లక్ష్మీనారాయణ రెడ్డిలతో కలిసి ఈనెల 5వ తేదీ పీలేరులో అడిగింది. అనంతరం అతన్ని తన స్వగ్రామమైన దీన్నే వడ్డేపల్లికు తీసుకువచ్చి కొట్టి అతని వద్దనున్న బంగారు చైన్‌ను, అదేవిధంగా రూ.80 వేలు డబ్బును తీసుకొని పంపించింది. దీనిపై వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏపిఈడబ్ల్యూఐడిసి ఛైర్మన్‌కు సన్మానం



ప్రజాశక్తి- కుప్పం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన రాజశేఖర్‌ను స్థానిక టిడిపి నాయకులు బుధారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి నాయకులు ఏపిఈడబ్ల్యూఐడిసి అధ్యక్షులను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంల సహకారంతో ఏపిఈడబ్ల్యూఐడిసి అధ్యక్షులుగా రాజశేఖర్ నియమితులు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీ అధిష్టానం తగిన గుర్తింపును ఇచ్చి, సముచితస్థానాన్ని కల్పిస్తుంది అనడానికి ఇది ఒక తార్కానుమన్నారు. రాజశేఖర్ భవిష్యత్తులో మరిన్ని పదవులను అధిరోహించాలని ఆశించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోపినాథ్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణు, కుమ్మరి శాలివాహన సాధికార కమిటీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ ఓడియార్, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటి సభ్యులు కన్నన్, రాజారామ్, మంజునాథ్, కుప్పం పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.